

ఆదిత్యుడి ఆదాయం రూ.4.72 లక్షలు

శ్రీకాకుళం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో కొలువైన శ్రీ సూర్యనారాయణస్వామిని మార్గశిర ఆదివారం నాడు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేకువజాము నుంచి క్యూలైన్లో భక్తులు బారులు దీరారు. సూర్యనారాయణస్వామికి ఆదివారం ఒక్కరోజు మొత్తం ఆదాయం రూ.4,72,665 లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ. 2,06,600, పూజలు, విరాళాల ద్వారా రూ.72,050, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,94,015 సమకూరినట్టు దేవాలయ అధికారులు వెల్లడించారు.

ఆ దుకాణాలు.. ఫినిష్!

- మూణ్నాళ్ల ముచ్చటగా ఫిష్ ఆంధ్ర ఔట్‌లెట్లు
- వైసీపీ హయాంలో ఆర్భాటంగా ఏర్పాటు
- నిర్వహణ భారమై.. నీరుగారిన లక్ష్యం



హిరమండలంలో మూతపడిన ఫిష్ ఆంధ్ర దుకాణం

హిరమండలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి)

'ఫిష్ ఆంధ్ర పథకం అమలుతో ఆక్వా రంగానికి చేయూతనిస్తాం. మత్స్య ఉత్పత్తుల వినియోగం పెంచి.. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామ'ని వైసీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రచార ఆర్భాటాలతో ఊదరగొట్టారు. రూ.558 కోట్ల పెట్టుబడితో రాష్ట్రవ్యాప్తంగా 70 ఆక్వాహబ్‌లు, 14వేల దుకాణాల ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పారు. కాగా.. ఈ ప్రచార ఆర్భాటాలన్నీ మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలాయి. చెప్పిన మాటలకు వాస్తవ పరిస్థితులకు ఎక్కడా పొంతన లేక పోవడంతో యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చిన లబ్ధిదారులు వెనకడుగు వేశారు. దుకాణాలు తెరిచిన మరికొందరు మత్స్య ఉత్పత్తుల రవాణా, నిర్వహణ భారమై యూనిట్లు మూసేశారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధితో పాటు చేపల ఉత్పత్తులను పెంచాలనే ఉద్దేశంలో గత వైసీపీ ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర దుకాణాలను ప్రారంభించింది. ఈ మేరకు జిల్లాలో మొత్తం 152 ఫిష్ ఆంధ్ర దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటిలో చాలావరకు మూతబడ్డాయి. రూ.లక్ష నుంచి రూ.50లక్షల వరకు యూనిట్లు మంజూరు చేశారు. చేపల వినియోగాన్ని స్థానికంగా పెంచాలనే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీ మహిళలకు 60శాతం, ఇతరులకు 40 శాతం పెట్టుబడి రాయితీని ప్రకటించి ఆ శాఖ అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. ఈ మొత్తానికి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద కేంద్రం అందించిన నిధులను మళ్లించారు. కొందరు రాయితీ కోసమే యూనిట్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో ఫిష్ ఆంధ్ర యూనిట్లు అన్నీ దాదాపు మూతపడ్డాయి.

అంతా హడావుడే..

ఫిష్ ఆంధ్ర యూనిట్ల ఏర్పాటుకు మత్స్య శాఖ అధికారులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఒక యూనిట్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఆ శాఖ అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. అయితే యూనిట్ల ఏర్పాటుపై అధికారులకు పూర్తి సమాచారం లేక, రకరకాల మార్పులు చేయడం, గ్యారంటీగా లబ్ధిదారులకు స్థిర ఆస్తులు లేకపోవడంతో బ్యాంకర్లు రుణాల మంజూరుకు సహకరించలేదు. ముందు చెప్పిన డిపాజిట్లు కంటే రెట్టింపు చెల్లించాలని డిమాండ్ చేయడంతో లబ్ధిదారులు అయోమయం చెందారు. ఆచరణలో వైఫల్యాలు, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లోపించడం, సిఫారసులకు పెద్దపీట వేయడం తదితర కారణాలతో ఎదురైన వైఫల్యాలు.. ఈ పథకాన్ని దెబ్బతీశాయి.

- పలు మండలాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి, రోడ్డు పక్కన దుకాణాల్లో వీటిని ఇష్టానుసారంగా ఏర్పాటు చేశారు. వీటితో పాటు దుకాణాల్లో ఉండాల్సిన ఫ్రీజర్లు, ఐస్ బాక్సులు వంటి శీతల యంత్రాల రేట్లకు సంబంధించిన కొటేషన్లు రెట్టింపు ధరలకు ప్రభుత్వానికి అందించారనే ఆరోపణలున్నాయి. తమకు ఉపాధి అవకాశం లభిస్తుందని ఆశించిన నిరుద్యోగులకు ఈ పథకం కలిసి రాలేదు. నిబంధనలు ప్రకారం చేపలు,రొయ్యలు వంటి ఉత్పత్తులను సరఫరా చేయాల్సిన మత్స్యశాఖ అధికారులు తమ వల్ల కాదంటూ చేతులెత్తేశారు. దీంతో దుకాణదారులు వ్యాపారుల వద్ద కొనుగోలు చేసుకొని రవాణా, నిర్వహణ భారం, విద్యుత్ ఖర్చులు, వాటిని నిల్వ ఉంచి విక్ర యించాల్సి రావడంతో తలకు మించిన భారమౌతుందని ఔట్‌లెట్లు మూసేశారు. మత్స్య శాఖ సూచించిన ధరలకు ఎక్కడా విక్రయాలు జరగడం లేదు.

నిరుద్యోగుల ఆశలు ఉఫ్..

పోలాకి: గత ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న ఆశయంతో ఎంతో ఆర్భాటంగా 2022లో ఏర్పాటుచేసిన ఫిష్ ఆంధ్రా కేంద్రాలు మూతపడుతున్నాయి. పోలాకి మండలంలో పోలాకి, ప్రియాగ్రహారం, బెలమర, చెల్లాయివలస, చల్లబంద, మబగాం, జడూరు, కొత్తరేవు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఈ దుకాణాలు సరిగా నడపడంలేదు. పోలాకి మండలం అంబీరుపేట వద్ద ఆంధ్రా లైవ్ ఫిష్ కేంద్రం శిథిలావస్థకు చేరింది. ప్రియాగ్రహారంలో ఫిష్ ఆంధ్రా కొనుగోలు కేంద్రాన్ని ఎత్తివేసి.. ఆ ప్రాంతంలో మెకానిక్ షెడ్ నడుపుతున్నారు. సరిగా బేరాలు లేక ఫిష్ ఆంధ్రా కొనుగోలు కేంద్రాలు మూతపడుతున్నాయని మత్స్యశాఖ ప్రతినిధి ఢిల్లీశ్వరరావు తెలిపారు.



పోలాకి: అంబీరుపేట వద్ద ఫిష్ ఆంధ్ర దుకాణం ఇలా..

రైల్వే పనులు వేగవంతం చేయాలి

- కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు


రైల్వే అధికారులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే రైల్వే పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. వివిధ స్టేషన్లలో అభివృద్ధి పనులతోపాటు కొత్త రైళ్లను కేటాయించాలని సూచించారు. విశాఖపట్నంలో వాల్తేర్ ఏడీఆర్ఎం మనోజ్ సాహు అధ్యక్షతన సీనియర్ డీఈఎన్ వెంకటరమణ పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించిన డివిజనల్ రైల్వే సమీక్షలో ఆయన పాల్గొన్నారు. అమృత్ భారత్ పథకంలో ఎంపికైన శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస), పలాస, ఇచ్ఛాపురం, నౌపడ స్టేషన్లలో జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో జిల్లా ప్రత్యేకతను తెలియజేసేలా అరసవల్లి శ్రీసూర్యదేవాలయం ఆకృతి నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న నాలుగు ప్లాట్‌ఫారంలను ఆరుగా విస్తరించి.. రెండు వైపులా నుంచి రాకపోకలు సాగించేలా పనులు చేపట్టాలన్నారు. ఉర్లాం స్టేషన్ అభివృద్ధి, కామేశ్వరిపేటలో పాసింజర్ హాల్టు కల్పించడంతో పాటు 'మెము' రైళ్ల నిలుపుదల పునరుద్ధరించాలని పేర్కొన్నారు. కోటబొమ్మాళి, పూండిలో భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

నౌపడ-గుణుపూర్ విస్తరణ

జిల్లాలోని నౌపడ నుంచి ఒడిశాలోని గుణుపూర్ మధ్య ఉన్న సింగిల్ లైన్‌లో మరిన్ని రైళ్ల రాకపోకలు చేసేలా తెంబూరు, కాశీగనర్‌లో క్రాసింగ్ సౌకర్యం కల్పించాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సూచించారు. టెక్కలి, పాతపట్నం స్టేషన్లను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నౌపడలో కొత్త ఎఫ్ఓబీ, ప్రయాణీకుల వెయిటింగ్ షెడ్, పూండిలో ఎఫ్ఓబీ, హరిశ్చంద్రపురంలో ప్రయాణికుల భవనం, కొత్తరోడ్డు.. రౌతుపురంలో ప్లాట్‌ఫారం పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.

దూసిలో గాంధీ స్మారకం

ఉత్తరాంధ్రకు చెందిన వేలాదిమంది వలస కార్మికులు సంక్రాంతికి స్వస్థలాలకు చేరుకుంటారని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు గుర్తుచేశారు. రద్దీకి అనుగుణంగా జనవరి 10, 11, 12 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం నుంచి ప్రత్యేక రైళ్లు నడపాలని కోరారు. అలాగే దేశ స్వాతంత్ర్య పోరాటం, చారిత్రక నేపథ్యం ఉన్న దూసి రైల్వేస్టేషన్‌లో గాంధీ స్మారక భవన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన వాల్తేర్ డివిజనల్ అధికారులు.. ప్రతిపాదనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి.. పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కూడా పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

- ఇంటర్, పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- గత లోటుపాట్లు సరిచేస్తూ 'సంకల్ప్' అమలు



నరసన్నపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో ఇంటర్మీడియట్, పదోతరగతి విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వైసీపీ హయాంలో అమలైన లోటుపాట్లు సరిచేస్తూ.. విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తోంది. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు సంకల్ప్-2025 కార్యక్రమానికి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది.

జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 6,372 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం, 5,444 మంది ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో వైఫల్యం చెందింది. గత ఐదేళ్లలో ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించలేదు. దీంతో మార్కెట్‌లో వాటిని కొనుగోలు చేయలేక పేద విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అధ్యాపకులు తరగతిలో బోధించినవి రాసుకుని కొంతమంది చదివేవారు. ఈ క్రమంలో ఉత్తీర్ణత శాతం తగ్గింది. గతేడాది ప్రథమ సంవత్సరం విద్యార్థులు 63శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 56శాతమే పాసయ్యారు. ఈ లోటుపాట్లను గుర్తించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. ఇటీవల సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బంది పాఠ్య, నోట్‌పుస్తకాలు అందించడంతో పాటు.. కళాశాల పనివేళలు సైతం పెంచారు. గతంలో 9.45 గంటలకు ప్రారంభమయ్యే తరగతులను 9.10కి మొదలయ్యేలా చేశారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఇవి పక్కాగా అమలయ్యేలా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధనే ధ్యేయంగా చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

- అక్టోబర్ నెలలో నిర్వహించిన త్రైమాసిక పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను గుడ్, పూర్, ఫెయిల్డ్ విభాగాలుగా విభజించారు. చదువులో వెనుకబడిన ప్రతి ఐదారుగురి విద్యార్థులను మెరుగు పరిచే బాధ్యతను ఒక్కో అధ్యాపకుడికి అప్పగించారు. దీంతో పాటు అన్ని కళాశాలలకు సమాధానాలతో రూపొందించిన క్వశ్చన్ బ్యాంక్ అందించనున్నారు. రోజువారీ అధ్యయనంలో భాగంగా.. విద్యార్థులు దానిని చదివి ప్రశ్నలకు జవాబులు రాయాలి. అవసరమైన పక్షంలో 5 గంటల తర్వాత కూడా స్టడీ అవర్ కొనసాగిస్తారు. విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా ప్రిన్సిపాల్స్ టైంటేబుల్ రూపొందిస్తారు. తరగతుల నిర్వహణ ఫొటోలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. సంబంధిత అధికారులు వారానికి మూడు కళాశాలలను సందర్శించి కార్యక్రమం అమలు తీరుపై సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందజేస్తారు.
- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు, కేజీబీవీ, మోడల్ ఇతర గురుకులాల్లో ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానాన్ని తీసుకొచ్చారు. యూనిట్ పరీక్షలు మొదలు త్రైమాసిక, అర్ధ సంవత్సర ప్రశ్న పత్రాలను పరీక్షకు గంట ముందు ఆన్‌లైన్‌లో పంపే ఏర్పాట్లు చేశారు. దీని వల్ల ప్రతి కళాశాలలో సకాలంలో సిలబస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే సిలబస్ పూర్తికాగా.. పరీక్షలకు విద్యార్థులను సమయత్తం చేస్తున్నారు.

పదిలో కూడా..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. సాయంత్రం అదనంగా గంట పాటు ప్రత్యేక స్టడీఅవర్స్‌ను నిర్వహిస్తున్నారు. గణితం, ఇంగ్లీషు, సైన్సు తదితర సబ్జెక్టుల్లో వెనుకబడిన వారికి తర్ఫీదు ఇస్తున్నారు. జిల్లాలో 414 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 21,874 మంది విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి చదువుతున్నారు. వీరిలో బాలురు 10,514 మంది, బాలికలు 11,360 మంది ఉన్నారు. వీరిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి కనీసం ఉత్తీర్ణత సాధించేలా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. అభ్యాసన సామర్థ్యాలు తక్కువ ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ముఖ్యమైన ప్రశ్నలను నేర్పిస్తున్నారు. శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని డీఈవో ఎస్.తిరుమల చైతన్య తెలిపారు.

పక్కాగా అమలు..

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించాం. ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం రూపొందించిన సంకల్ప కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తాం. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

-తవిటినాయుడు, డీవీఈవో, ఇంటర్ విద్య


ఆలపిస్తున్న గజల్ శ్రీనివాస్



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


'ద్రౌపది' ప్రదర్శన

అలరించిన 'గజల్'.. ఆకట్టుకున్న 'ద్రౌపది'

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య రజతోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ఓ వైపు ప్రముఖ గజల్ గాయకుడు శ్రీనివాస్ గానమృతం.. మరోవైపు ద్రౌపది జీవితగాథ మహాప్రస్థానం ప్రదర్శన రంజింపజేశాయి. కూచిపూడి గురుకులం డైరెక్టర్ స్వాతీ సోమనాథన్ శిష్య బృందం ప్రదర్శించిన ద్రౌపది నృత్య రూపకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ద్రౌపది కథలో భాగంగా ఒక ఆడది పడే కష్టాలు, బాధలు, పురుష అహంకార ఘటనలన్నీ ప్రదర్శించారు. ఇదే నృత్య ప్రదర్శనను ఇటీవల యూకేలో ప్రదర్శించి మంచి పేరు సంపాదించారు.

అనంతరం గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సి.నారాయణ రెడ్డి రచించిన "నాన్న పైన", 'పల్లెటూరు గొప్పతనం', 'దేశభక్తి', 'నా బాల్యం నాకిచ్చే' పలు గీతాలను ఆలపించి ఆహుతులను ఉత్తేజపరిచారు. డాక్టర్ గజల్ శ్రీనివాస్‌ను, స్వాతీ సోమనాథన్‌ను వారి శిష్యబృందాన్ని రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం గుంటూరు బృందం ఎస్.రవీంద్ర రెడ్డి దర్శకత్వంలో 'ఇది అతని సంతకం' నాటిక ప్రదర్శన అలరించింది.

ఆగని 'బెల్టు'!

- జిల్లాలో పట్టుబడుతున్న అక్రమ మద్యం
- పైడిభీమవరంలో 174 సీసాలు స్వాధీనం

రణస్థలం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో బెల్ట్ షాపులకు అవకాశం లేదు. ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహించినా.. అధిక ధరలకు మద్యం విక్రయించినా చర్యలు చేపడతాం. సంబంధిత షాపుల లైసెన్సులు రద్దు చేస్తామ'ని సీఎం చంద్రబాబు ఇటీవల హెచ్చరిక జారీచేశారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉన్నా.. జిల్లా యంత్రాంగం మాత్రం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదన్న విమర్శ ఉంది. బెల్ట్‌షాపుల జోరు కొనసాగుతూ.. అక్రమ మద్యం పట్టుబడుతూనే ఉంది. తాజాగా రణస్థలం మండలం పైడిభీమవరంలో ఆదివారం ఓ వ్యక్తి వద్ద 174 మద్యం సీసాలు జేఆర్ పురం పోలీసులకు పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది. తనిఖీల సమయంలో పైడిభీమవరానికి చెందిన లంకపల్లి మధుసూదనరావు వద్ద ఈ బాటిళ్లు లభ్యమయ్యాయని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు 25వేలు ఉంటుందని వెల్లడించారు. మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని.. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.


పైడిభీమవరంలో పట్టుబడిన అక్రమ మద్యం

మారని తీరు

వైసీపీ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు నడిచేవి. నాసిరకం మద్యంతో పాటు అధిక ధరలకు మద్యం విక్రయించేవారు. దీంతో సరిహద్దు రాష్ట్రాల మద్యంతో పాటు పెద్ద ఎత్తున సారా చలామణీ అయ్యేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి మారింది. జిల్లావ్యాప్తంగా 158 మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కేటాయించడంతో ఇక బెల్ట్‌షాపులు ఉండవని ప్రభుత్వం ప్రచారం చేసింది. ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహించినా.. మద్యం దుకాణాల నుంచి మద్యం సరఫరా చేసినా అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించింది. కానీ కొందరు వ్యాపారులు ఈ హెచ్చరిక పెడచెవిన పెడుతున్నట్టు ప్రచారం నడుస్తోంది. తాజాగా పైడిభీమవరంలో పెద్ద ఎత్తున మద్యం నిల్వలు పట్టుబడడమే ఇందుకు ఉదాహరణ. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 3500 వరకూ బెల్టు దుకాణాలు నడిచినట్టు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. కానీ ఎక్కడా ధ్రువీకరించలేదు. అయితే దుకాణాలు ప్రభుత్వం నుంచి ప్రైవేటుకు మారడంతో బెల్టు దుకాణాలకు చెక్ పడుతుందని అంతా భావించారు. కాగా ప్రైవేటు మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు బెల్టుకు ప్రోత్సహిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. వీటిపై యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపడుతుందో చూడాలి.



విశాఖలో పారాగ్లైడింగ్

»» విజయవంతమైన ట్రయల్‌రన్

సాగర్‌నగర్ (విశాఖపట్నం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరాన్ని సందర్శించే పర్యాటకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేందుకు రుషికొండ బీచ్‌లో పారాగ్లైడింగ్ అందుబాటులోకి రానుంది. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో లెవెన్ అడ్వెంచర్స్ సంస్థ ఆదివారం నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఈ బీచ్‌లో ఇప్పటికే బోటుషికార్, స్కూబా డైవింగ్ తదితర అడ్వెంచర్స్ స్పోర్ట్స్ అందుబాటులో వున్నాయి. పారాగ్లైడింగ్ కొత్త అనుభూతిని అందించనుంది. నింగి, నేలను తాకుతూ సముద్రంలో ఎగసిపడే కెరటాలు.. మరో పక్క ఎత్తైన కొండలను వీక్షిస్తూ నీలాకాశంలో విహరించడం పర్యాటకులకు మధురానుభూతినిస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు.

అనంత పోలీసుల కస్టడీలో బోరుగడ్డ

విచారణలో 'తెలియదు, గుర్తులేదు..' సమాధానాలు

అనంతపురం క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను అనంతపురం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న ఆయన్ను ఆదివారం తెల్లవారుజామున అనంతపురం తీసుకొచ్చారు. సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులను అసభ్యకరంగా విమర్శిస్తూ బోరుగడ్డ యూట్యూబ్ చానల్‌లో మాట్లాడారని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజశ్విని నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ నిమిత్తం బోరుగడ్డను కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి కోర్టు నుంచి మూడు రోజుల కస్టడీ కోరారు. శనివారం అతనికి వైద్య పరీక్షలు అక్కడే నిర్వహించారు. కాగా, బోరుగడ్డ విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన్ను తెల్లవారుజామున 1.20 గంటల సమయంలో పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా.. అప్పటికే అక్కడి లైట్లన్నీ ఆర్పేశారు. వచ్చీ రాగానే అనిల్‌ను లోపలకు తీసుకెళ్లారు. ఆదివారం సైతం పోలీసుస్టేషన్‌కు తాళం వేశారు.



విచారణకు సహకరించని అనిల్

విచారణలో అనిల్ పోలీసులకు సహకరించలేదని సమాచారం. 'తెలియదు.. పెద్దగా గుర్తులేదు..' అనే సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఆదివారం అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో విచారించారు. వీఆర్వోల ఎదుట స్టేట్‌మెంట్‌ను తీసుకున్నట్లు తెలిసింది. అనిల్ గతంలో మాట్లాడిన వీడియోల ఆధారంగా 'నువ్వే కదా ఈ వీడియోలో మాట్లాడింది' అని ప్రశ్నించినట్లు తెలిసింది. 3 రోజుల కస్టడీ తర్వాత అతనికి సోమవారం సాయంత్రం వైద్య పరీక్షలు నిర్వహించి, స్థానిక కోర్టులో హాజరుపరిచిన తర్వాత రాజమండ్రి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రయాణ సమయాన్ని చూపి మంగళవారం ఉదయం అక్కడి కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

»» 11న రాయలసీమ, దక్షిణ కోస్తాలో వర్షాలు



విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం నాటికి స్థిరంగా కొనసాగుతోంది. దీనిపై ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉండగా, ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి సోమవారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. తరువాత కూడా పశ్చిమ వాయవ్యంగా పయనించి ఈనెల 11వ తేదీనాటికి శ్రీలంక, తమిళనాడు తీరాలకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించనుంది. దీని ప్రభావంతో 11వ తేదీన రాయలసీమలో విస్తారంగా, దక్షిణ కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆదివారం కోస్తా, రాయలసీమలో ఎక్కువ ప్రాంతాల్లో మేఘాలు ఆవరించి చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

అన్నదాతలను అప్రమత్తం చేయాలి: కలెక్టర్లకు సీఎం ఆదేశాలు

అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కల్లాల్లో ధాన్యం తడవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వరి కోతలు వాయిదా వేసుకునేలా అన్నదాతలను అప్రమత్తం చేయాలని ఆదివారం రాత్రి కలెక్టర్లు, జేసీలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రైతులు నూర్పిన ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వరికుప్పలు, ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు రైతులు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని వ్యవసాయశాఖను ఆదేశించారు.

వెనక'బడి'ంది!



- »» ఒక్క పాఠశాలకూ దక్కని 5 స్టార్ రేటింగ్
- »» నాలుగు స్టార్లు దక్కిన బడులూ తక్కువే
- »» ఏకంగా 398 బడులకు జీరో స్టార్ రేటింగ్
- »» సర్కారు స్కూళ్లలో సదుపాయాల లేమి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో చాలాచోట్ల మౌలిక సదుపాయాలు ఉంటే సరైన ఫలితాలు లేవు. అభ్యసన ఫలితాలు బాగున్న చోట సదుపాయాలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల అసలు ఈ రెండూ లేవు. అటు మౌలిక సదుపాయాలు, ఇటు ఫలితాల్లో అత్యుత్తమంగా నిలిచిన బడి రాష్ట్రంలో ఒక్కటీ లేదు. కూటమి ప్రభుత్వం తాజాగా చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెలుగు చూసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ బడుల స్థితిగతులను తెలుసుకునేందుకు మౌలిక సదుపాయాలు, అభ్యసన ఫలితాల (లెర్నింగ్ అవుట్‌కమ్స్)కు ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను ప్రకటించింది. ఏ బడి ఏ స్థాయిలో ఉంది? అనే కోణంలో వివరాలు సేకరించడంతో ఇప్పటివరకూ వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రచారం అంతా ఉత్తదేనని తేలిపోయింది. బడుల్లో మౌలిక సదుపాయాలకు 5 స్టార్లు, అభ్యసన ఫలితాలకు 5 స్టార్లు ప్రామాణికంగా ఈ అధ్యయనం నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 45,087 ఉంటే... వాటిలో ఏ ఒక్కటి కూడా కనీసం ఒక విభాగంలోనూ ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. మరోవైపు సదుపాయాల్లో 87, అభ్యసన ఫలితాల్లో 311 బడులకు అసలు రేటింగే దక్కని (జీరో రేటింగ్) దారుణమైన స్థితిలో ఉన్నాయి.

> విద్యారంగంలో సంస్కరణల పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసం పాఠశాలలను దీన స్థితిలోకి నెట్టేసింది. చదువులను గాలికొదిలి టోఫెల్, బైజూస్, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ సిలబస్ అంటూ చేసిన ప్రయోగాలు విద్యా ప్రమాణాలను దారుణంగా దెబ్బతీశాయి. విద్యార్థుల హాజరు, ఫలితాలను పట్టించుకోకుండా టీచర్లకు బోధనేతర బాధ్యతలు అప్పగించడంతో పాటు బోధన సమయాన్ని తగ్గించడంతో పిల్లల చదువులు అటకెక్కాయి. 'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే మార్చేస్తామని ప్రగల్భాలు పలికినా.. ఆ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో బడుల్లో మౌలిక సదుపాయాలూ అంతంతమాత్రంగానే ఉన్నాయని తేలిపోయింది. గత ప్రభుత్వం తీరుతో ఇప్పుడు పాఠశాలలు సింగిల్ స్టార్ దక్కించుకోవడానికే ఆపసోపాలు పడుతున్నాయి.

సొంత భజనతో సరి

రాష్ట్రంలోని ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు గత వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రచారం చేసుకుంది. 'నాడు- నేడు'తో బడి స్వరూపాన్ని మార్చేశామని జగన్ పదే పదే సొంత భజన చేసుకున్నారు. తీరా ఇప్పుడు మౌలిక సదుపాయాల విభాగంలో ఒక్క పాఠశాల కూడా ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. అదేవిధంగా అభ్యసన ఫలితాల్లో సైతం ఒక్కటీ ఫైవ్ స్టార్ సాధించకపోగా, కేవలం 41 పాఠశాలలు మాత్రమే ఫోర్ స్టార్ సాధించాయి. మిగిలిన 45 వేల పైచిలుకు బడులన్నీ త్రీ స్టార్, అంతకంటే తక్కువ స్థాయికే పరిమితమయ్యాయి.

స్టార్ రేటింగ్ ఇలా...

మౌలిక సదుపాయాల విభాగంలో రేటింగ్ కోసం 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. బడిలో మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, క్రీడా మైదానం, ప్రహరీ, గ్రంథాలయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, తరగతి గదులు, తాగునీరు తదితరాలను పరిశీలించారు. ఒక్కో అంశానికి 5 చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు. వీటిలో 90 శాతం గ్రేడింగ్ సాధించిన బడులకు 5 స్టార్లు కేటాయించారు. 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్ ఇచ్చారు. అభ్యసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, గతేడాది పదో తరగతి పరీక్షల ఫలితాలు, ఇటీవల జరిగిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను, ఒకవేళ పదో తరగతి లేకపోతే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను ప్రామాణికంగా తీసుకున్నారు. ఈ నాలుగు విభాగాల్లో హాజరుకు 40 శాతం, ఫలితాలకు 60 శాతం గ్రేడింగ్ ఇచ్చారు. రెండూ కలిపి 90 శాతం దాటిన బడులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితాలున్న బడులకు 1 నుంచి 4 స్టార్లు కేటాయించారు.

అన్ని జిల్లాల్లోనూ అదే తీరు

ప్రభుత్వ పాఠశాలల స్థితి దాదాపుగా అన్ని జిల్లాల్లోనూ ఒకేలా ఉంది. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ జిల్లాలో 2,913 బడులకు గాను 161 చోట్ల మాత్రమే మౌలిక సదుపాయాలు ఫరవాలేదన్నట్టుగా ఉన్నాయి.

బడులకు ఇచ్చిన రేటింగ్‌లు ఇలా..

స్టార్ రేటింగ్	మౌలిక సదుపాయాలు	అభ్యసన ఫలితాలు
జీరో స్టార్	87	311
ఒక్క స్టార్	1,958	14,095
టూ స్టార్	16,816	26,272
త్రీ స్టార్	19,438	4,368
ఫోర్ స్టార్	6,788	41
ఫైవ్ స్టార్	0	0


అయితే అభ్యసన ఫలితాలు మాత్రం దిగజారిపోయాయి. ఈ విభాగంలో ఒక్క బడి కూడా నాలుగు స్టార్లు సాధించలేదు. అనకాపల్లి, అనంతపురం, బాపట్ల, కాకినాడ, కర్నూలు, ఎన్టీఆర్, నెల్లూరు, శ్రీసత్యసాయి, విశాఖ జిల్లాల్లోనూ ఒక్క పాఠశాలకూ నాలుగు స్టార్లు దక్కలేదు. ఎక్కువ పాఠశాలలు రెండు, మూడు స్టార్లతోనే సరిపెట్టుకున్నాయి.

ఫలితాల్లేని సదుపాయాలెందుకు?

వైసీపీ ప్రభుత్వం బడులను రాజకీయ ప్రచారానికి వాడుకుంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను గాలికొదిలేసింది. నాడు-నేడు పేరుతో బడులకు రంగులు, కుర్చీలు, బెంచీలు అంటూ బోధనను నిర్లక్ష్యం చేసింది. టీచర్లకు నాడు- నేడు పనులు, మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతలు అప్పగించి బోధన సమయాన్ని తగ్గించింది. దీనిపై అప్పట్లో ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టారు. కానీ జగన్ ప్రభుత్వం వారి ఆందోళనలను పెడచెవిన పెట్టింది. పాఠశాల విద్య అంటే నాడు-నేడు పథకం ఒక్కటేనన్నట్టుగా మార్చేసి, ఫలితాలను దిగజార్చింది.

నవ్య | చిత్రజ్యోతి

పోరాట వీరుడి కథ



విజయ్ సేతుపతి, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'విడుదల-2'. ఈనెల 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. నిర్మాత చింతపల్లి రామారావు ఈ చిత్ర తెలుగు హక్కులను దక్కించుకున్నారు. కాగా, ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను కథానాయకుడు విజయ్ సేతుపతి చెన్నైలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'పెరుమాళ్ అనే పాత్రలో విజయ్ సేతుపతి అభినయం ఈ చిత్రానికి హైలెట్‌గా ఉండబోతోంది. పెరుమాళ్ పోరాట వీరుడిగా ఎలా మారాడు అనేది ఎంతో ఆసక్తికరంగా ఈ చిత్రంలో వెట్రిమారన్ ప్రజెంట్ చేశారు. తెలుగులో విజయ్ సేతుపతికి ఎందరో అభిమానులు ఉన్నారు. ఈ చిత్రంలో ఎమోషన్స్, యాక్షన్ అన్నీ రియాల్టీకి దగ్గరగా ఉంటాయి. ఇళయరాజా సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా ఉంటుంది' అని అన్నారు. మంజువారియర్, సూరి, భవాని శ్రీ, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సూర్య సేతుపతి, అనురాగ్ కశ్యప్, రాజీవ్ మీనన్ తదితరులు ఈ చిత్రంలో నటించారు. కాగా, గతేడాది రిలీజైన 'విడుదల' పార్ట్ 1 చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకొని సూపర్ హిట్‌గా నిలిచింది.

యాక్షన్ థ్రిల్లర్



పూర్వజ్ దర్శకత్వం వహిస్తూ హీరోగా నటిస్తున్న చిత్రం 'కిల్లర్'. పూర్వజ్, ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. ఈ మూవీ ఫస్ట్ షెడ్యూల్‌ను హైదరాబాద్, వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. 10 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో హీరో పూర్వజ్, హీరోయిన్ జ్యోతి పూర్వజ్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొన్నారు. ప్రస్తుతం రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో మరో హీరో విశాల్ రాజ్ పాల్గొంటారు. రామోజీ ఫిల్మ్ సిటీ, మొయినాబాద్ లొకేషన్స్‌లో జరిగే ఈ చిత్రీకరణలో గౌతమ్, జ్యోతి పూర్వజ్ పాల్గొంటారు.

డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్



తెలుగు ఫిల్మ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్ ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రకాశ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. అధ్యక్షుడిగా ప్రకాశ్ ఎన్నికవడం ఇది ఐదోసారి. కాగా, జానీని అధ్యక్షుడిగా తొలగించడంతో పాటు ఆయన సభ్యత్వాన్ని కూడా రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జానీపై పోక్సో కేసు విచారణలో ఉండటం, అసోసియేషన్‌లో జానీ ప్రవర్తన అగ్రెసివ్‌గా ఉండేదనే రిపోర్టు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

మోహన్‌బాబు.. మనోజ్ మధ్య గొడవ?




సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు ఆయన చిన్న కొడుకు మనోజ్‌కు మధ్య ఆస్తుల పంపకాల విషయంలో గొడవ జరిగినట్లు మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ విషయం సినీ ఇండస్ట్రీతో పాటు.. అభిమానుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పహడీషరీఫ్ పరిధిలోని మోహన్‌బాబు ఇంట్లో ఆస్తుల పంపిణీ జరుగుతున్న క్రమంలో స్కూలుకు సంబంధించిన వాటాల్లో విభేదాలు తలెత్తి మోహన్‌బాబు అనుచరులు వినయ్ ఇతర బౌన్సర్లు మనోజ్‌పై, ఆయన భార్య మౌనికపై దాడికి పాల్పడి గాయపరిచినట్లు.. గాయాలతోనే మనోజ్ తన భార్యతో కలసి పహడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ విషయమై మహేశ్వరం డీసీపీని సంప్రదించగా డయల్-100కు కాల్ వచ్చిందని, వ్యక్తిగతంగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. కాలుకు గాయం అయిన మంచు మనోజ్ తన భార్య మౌనికతో కలసి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చారు. తండ్రితో జరిగిన గొడవ విషయమై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. మనోజ్, మౌనిక మాట్లాడటానికి నిరాకరించారు. కాగా, మనోజ్ ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో డిశ్చార్జి అయ్యారు. మనోజ్‌కు ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేసు) పూర్తి చేసిన వైద్యులు ఆయన ఒంటిపై అనుమానాస్పద దెబ్బలు ఉండటంతో ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాలు, మెడ భాగంలో గాయాలైనట్లు వైద్యులు నిర్ధారించారని తెలిసింది. సిటీ స్కాన్, ఆల్ట్రా సౌండ్ పరీక్షలు పూర్తి చేసిన వైద్యులు 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉండాలని సూచించగా.. సోమవారం మరోసారి ఆస్పత్రికి వస్తానని మనోజ్ డిశ్చార్జి అయినట్లు తెలిసింది.

అంతా అబద్ధం : మోహన్‌బాబు

ఆస్తుల పంపకాల్లో మా ఇంట్లో గొడవలు జరిగాయని.. మనోజ్‌ను నేను కొట్టానని ఉదయం నుంచి మీడియాలో షికార్లు చేస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని మోహన్‌బాబు తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. నిజానిజాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు చేయొద్దంటూ మీడియాకు సూచించారు.

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

14న ఎన్టీఆర్ సినీ ప్రస్థాన వజ్రోత్సవం



నందమూరి తారకరామారావు సినీ ప్రస్థాన వజ్రోత్సవం ఈ నెల 14న పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో జరుగుతుందని ఆయన కుమారుడు నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల చైర్మన్ టీడీ జనార్ధన్ పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఫిల్మ్ చాంబర్ హాల్లో ఆదివారం ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో టీడీ జనార్ధన్ మాట్లాడుతూ "సినీ, రాజకీయ రంగంలో ఎన్టీఆర్‌కు సాటి లేదు. కృష్ణుడిగా, రాముడిగా నటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన తొలిసారి నటించిన 'మనదేశం' చిత్రం 75 ఏళ్లు అయిన సందర్భంగా ఈ వేడుకను ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 'మనదేశం' చిత్ర నిర్మాత కృష్ణవేణి, దర్శకుడు ఎల్వీ ప్రసాద్ కుమారుడు రమేశ్ ప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు పలువురు చిత్ర పరిశ్రమ ప్రముఖులు పాల్గొంటారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌తో పాటు 24 క్రాఫ్ట్స్‌తో పాటు తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది" అని అన్నారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, సెక్రటరీ దామోదర్ ప్రసాద్, ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు అనుపమరెడ్డి, ఈసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

- ధర్నాచౌక్, విజయవాడ (ఆంధ్రజ్యోతి)

ఒక్కసారి ప్రేమిస్తే చాలు



బాలీవుడ్ సీనియర్ నటి రేఖ రీసెంట్‌గా ఓ రియాల్టీ షోలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక అంశాలను పంచుకున్నారు. జీవితంలో ఒక్కసారి మాత్రమే ప్రేమలో పడతారని కవులు తమ రచనల్లో రాస్తే...మరికొందరు మాత్రం ప్రేమకు ఆది, అంతం లేదంటున్నారు. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి అని యాంకర్ రేఖను ప్రశ్నించగా..'నా మటుకు, ఆ వ్యక్తి సరైన వాడైతే... ఒక్కసారి ప్రేమిస్తే చాలు' అని బదులిచ్చారు. మరో ప్రశ్నకు సమాధానంగా నిజమైన ప్రేమకు నిర్వచనం చెబుతూ 'ఎవరినైనా ప్రేమించండి, నా వరకైతే నేను మొదట అన్నిటినీ ప్రేమిస్తాను. నా వృత్తిని, నా స్నేహితులను, ఈ ప్రపంచాన్ని, ప్రకృతిని ఇలా..ప్రతీదాన్ని ప్రేమిస్తాను. కానీ, నన్ను నేను ఎక్కువగా ప్రేమిస్తా' అని చెప్పుకొచ్చారు. రేఖ మాటలు విన్న ప్రేక్షకులు ప్రశంసల జల్లు కురిపించారు.



మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి

ఇటీవలే 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ప్రస్తుతం ఆమె మరో వెబ్ సిరీస్ 'రక్త్‌బ్రహ్మాండ్'లో నటిస్తున్నారు. 'ద బ్లడీ కింగ్‌డమ్' అనేది ఉపశీర్షిక. తాజాగా, కొద్ది గ్యాప్ తర్వాత ఈ సిరీస్ సెట్స్‌లోకి ఆమె తిరిగి అడుగుపెట్టారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. బ్యాక్ టూ యాక్షన్ మోడ్ అని పేర్కొన్నారు. 2018లో విడుదలైన హారర్ చిత్రం 'తుమ్‌బాడ్'తో గుర్తింపు తెచ్చుకున్న అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్యాంటసీ వెబ్‌సిరీస్‌ను రాజ్ అండ్ డీకే నిర్మిస్తున్నారు. ఈ నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌లో ఆదిత్యరాయ్ కపూర్, ఆలీ ఫాజల్, వామికా గబ్బీ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



అరకులో మాస్ జాతర

రవితేజ నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' అనేది ట్యాగ్‌లైన్. 'సామజవరగమన' రచయిత భాను భోగవరపు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ ఆఫీసర్ పాత్రలో రవితేజ నటిస్తున్నారని వార్తలొస్తున్నాయి. సినిమా తాజా షెడ్యూల్ డిసెంబరు మూడో వారంలో అరకులో ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఆ తరవాత పాడేరు, ఆంధ్రా-ఒడిషా సరిహద్దు లొకేషన్స్‌లో చిత్రీకరణ జరగనున్నట్లు తెలిసింది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్, నవీన్ చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అసత్య ప్రచారాన్ని ఆపండి

- రెహమాన్ కుమార్తె ఖతీజా



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన భార్య సైరా బానుతో విడిపోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయనపై పలు ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు రెహమాన్ కుటుంబ సభ్యులు తిప్పికొడుతూనే ఉన్నారు. అయితే రీసెంట్‌గా మరో వార్త వైరల్ అవుతోంది. వైవాహిక బంధానికి స్వస్తి పలికిన రెహమాన్..సంగీతానికి కొంత కాలం దూరంగా ఉండనున్నారంటూ కోలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. రెహమాన్ మ్యూజిక్‌ని మిస్ అవ్వాల్సిందేనా? అంటూ సోషల్ మీడియాలో ఆయన అభిమానులు పోస్టులు పెట్టారు. ఈ వార్తలపై ఇప్పటికే రెహమాన్ కుమార్తె ఖతీజా 'ఎక్స్' వేదికగా స్పందించారు. అయినా రూమర్లు ఆగకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మరోసారి రియాక్ట్ అయ్యారు. 'దయచేసి అసత్య ప్రచారాన్ని ఆపండి' అని విజ్ఞప్తి చేశారు. వార్తను ప్రచురించిన ఓ మీడియాను కోట్ చేస్తూ అలా రాయడం సబబు కాదన్నారు.

రోడ్లు కాలువలు లేవు!



దిష్టిబొమ్మల్లా ఉన్న కాలనీలోని విద్యుత్ స్తంభాలు

- దిష్టిబొమ్మల్లా విద్యుత్ స్తంభాలు
- గృహ ప్రవేశాలు జరిగినా.. ఇళ్లలో ఉండేందుకు ఇబ్బంది
- బృందావన్ కాలనీలో సమస్యల తిష్ట



కనీస వసతులు లేని కాలనీ

ఇచ్ఛాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం 1, 2 వార్డుల పరిధిలో గల బృందావన్ కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ కాలనీ మంజూరు చేసింది. 180మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు గృహ రుణాలు కూడా అందించింది. ఇళ్ల పనులు జరుగుతుండగానే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో కాలనీని పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయి గృ హ ప్రవేశాలు జరిగినా విద్యుత్ సౌకర్యం లేక, ఇంట్లో దిగడానికి లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కాలనీల్లో పూర్తి నిర్లక్ష్యం వహించిం ది. ఇప్పుడొచ్చిన కూటమి ప్రభుత్వం అయినా పట్టిం చుకొని కాలనీలో విద్యుత్ సౌకర్యంతో పాటు, రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతు న్నారు. ప్రభుత్వం రుణాలు మం జూరు చేసినా.. మిగతా డబ్బులు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నామని అయినా ఇంట్లో దిగడానికి వీలులేకుండా పోయిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో విద్యుత్ స్తం భాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ పనులు జరగలేదు. దీంతో రాత్రి పూట బయటకి రావాలంటే భయపడు తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కనీసం మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు

గుజరాతీపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డిని జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా కోర్టులో మౌలిక సదుపాయాలు కల్పించాలని న్యాయమూర్తికి విన్నవించారు. న్యాయమూర్తిని కలిసిన వారిలో బార్ అధ్యక్షుడు కిలారి ఈశ్వరరావు, పీపీ వాన కృష్ణచంద్, కె.అఫీస్ నాయుడు, ఎన్ని సూర్యారావు, ఎ.సత్యనారాయణ, మామిడి శ్రీకాంత్, ఎం.అన్నంనాయుడు, బీఎస్ చలం తదితరులు పాల్గొన్నారు.

దేవీ ఆశ్రమంలో..

ఎచ్చెర్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కుంచాలకురమయ్యపేటలోని దేవీ ఆశ్రమాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి ఆదివారం సందర్శించారు. రాజరాజేశ్వరి అమ్మవారిని, మహా లింగాన్ని, 1,116 లింగాల దేవాలయాన్ని దర్శించుకున్నారు. దేవీ ఆశ్రమ విశిష్టతను పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆయనకు వివరించారు.

డిజిటల్ కోచ్ బోర్డు పనులు ప్రారంభం

కంచిలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక రైలు నిలయంలో డిజిటల్ కోచ్ పొజిషన్ బోర్డులను ఆదివారం ప్రారంభించినట్టు జెడ్ఆర్‌యూసీసీ మెంబర్ శ్రీనివాసరౌశో తెలిపారు. చాలా కాలంగా రైలు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి కృషిచేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనులను ఐవోడబ్ల్యూ పండా, స్టేషన్ మేనేజర్ టి.బెహరా, జగదీష్ పట్నాయక్, రైల్వే కమిటీ సభ్యులు లోళ్ల సూర్యనారాయణ, సాహుకారి తిరుపతి, పూనా రవికుమార్, కొనపల సురేష్ తదితరులు పర్యవేక్షించారు.

దుస్తుల పంపిణీ

గార, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కొంక్యాణపేటలో కొన్న చిన్నారావు, చిన్నమ్మడు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మార్పు ధర్మారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ పీస వెంకటరమణమూర్తి, మాజీ ఎంపీపీ గుండ భాస్కరరావు, సర్పంచ్ కె.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే శాలిహుండాంలో తాగునీటి పథకం కోసం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. దీపావళి గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఏపీ ట్రాన్స్‌కో ఎస్పీ



ప్రసాదాన్ని అందిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఏపీ ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్పీ) సీహెచ్ రామకృష్ణప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు స్వామి వారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు.



రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న హిందువులు

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి

- విజయవంతంగా సంఘీభావ ర్యాలీ

ఇచ్ఛాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో ఉన్న హిందువులకు రక్షణ కల్పించాలని విశ్వ హిందూ పరిషత్ సభ్యులు డిమాండ్ చేశారు. ఆ దేశంలో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆదివారం చేపట్టిన సంఘీభావ ర్యాలీ విజయవంతంగా సాగింది. గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం నుంచి విశ్వ హిందూ పరిషత్ సభ్యులతోపాటు అయ్యప్ప, హనుమాన్, శివ మాలలు ధరించిన స్వాములు, అంగన్‌వాడీ కార్యకర్తలు భారీగా తరలివచ్చి సంఘీభావ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీగా బస్టాండ్ వద్దకు చేరుకొని బైఠాయించి జైశ్రీరాం నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా హిందూ ధార్మిక సేవా సంస్థ సభ్యులు రాంప్రసాద్ మాస్టారు, పాక తులసీదాస్ మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు అమానవీయమని, హిందువులంతా ఒక్కటికావాలని, లేకుంటే రాబోయే రోజుల్లో మన దేశంపై కూడా దాడులు జరగవచ్చునన్నారు. కార్యక్రమంలో వివిధ దేవాలయాల కమిటీలు, వ్యాపార, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా సంఘాలు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, బీజేపీ జిల్లా మోర్చా అధ్యక్షురాలు బింగి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఒడియా విద్యార్థులకు పుస్తకాలందిస్తాం

- ఒడిశా శాసనసభ స్పీకర్, మంత్రి



మేధా సమ్మాన్ కార్యక్రమంలో పాల్గొన్న ఒడిశా శాసన సభ స్పీకర్, మంత్రి తదితరులు

కంచిలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఒడియా భాష చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు అందజేస్తామని ఒడిశా రాష్ట్ర శాసనసభ స్పీకర్ సురమా పాడీ, వాణిజ్యశాఖ మంత్రి బిభుతి భూషణ్ అన్నారు. కంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పదో మేథాసమ్మాన్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో సుమారు 12వేల మంది ఒడియా విద్యార్థులు ఉన్నారని, వారికి అవసరమైన అన్ని రకాల పాఠ్యపుస్తకాలు అందజేస్తామన్నారు. విద్యాబోధనకు ఉత్కళ్ సమ్మేళన్ ద్వారా వలంటీర్లను నియమించి వారికి గౌరవ వేతనాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. వారికి ఇస్తున్న గౌవర వేతనాన్ని రెట్టింపు చేయనున్నట్టు తెలిపారు. స్కూల్ లైబ్రేరీలకు కావాల్సిన ఒడియా పుస్తకాలను సమకూరుస్తామన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ.. తన నియోజకవర్గ పరిధిలోని మందస మండలంలో రెండు ఒడియా పాఠశాలలు ఉన్నాయని, ఆ పాఠశాలలకు అవసరమైన బోధనా సిబ్బంది, పాఠ్యపుస్తకాలు తదితర సమస్యలను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతోపాటు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, డీఈవో తిరుమల చైతన్య, ఒడియా డీఐ దుర్గాప్రసాద్ చౌదరి, ఉషోమా (ఒడియా లింగ్విస్టిక్ మైనారిటీ అసోసియేషన్ అధ్యక్షుడు) సత్యనారాయణ పాడీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ప్రహరీలు లేవాయే!

- ఆవరణల్లోకి పశువులు, కుక్కలు
- ఇబ్బందిపడుతున్న విద్యార్థులు



శాలిహుండాం కొండ పక్కనే పహరీ లేని ప్రాథమిక పాఠశాల

గార, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో చాలా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. మండలంలో 72 ప్రాథమిక పాఠశాలలు, 15 ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, తొమ్మిది ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాల, ఒక బాలికల గురుకుల పాఠశాల ఉంది. వీటిలో చాలా పాఠశాలలకు ప్రహరీలు లేక తరగతులు నిర్వహణకు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా గార, చింతాడ ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న జోగి పంతులుపేట, కొండ పక్కనే ఉన్న కొల్లివలస, సీఎస్‌పీ రోడ్డు దగ్గరగా ఉండే రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాల, వర్షపు నీరు ఎదురుగా నిలిచిపోయే మత్స్యకారులు గ్రామం బందరువానిపేట కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలతో పాటు కొళ్లపేట, మెండపేటలో ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు లేక ఆవరణలోకి పశువులు, కుక్కలు, కోళ్ల వస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. ఈ పాఠశాలల్లో ప్రహరీలు నిర్మించాలని అధికారులు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిన నేటి వరకు ఏవిధమైన చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని ఆయా గ్రామాల వారు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కూడా ఏవిధమైన చర్యలు చేపట్టకపోవడంతో కూటమి ప్రభుత్వంలో అయినా ఈ పాఠశాలలు వద్ద ప్రహరీలు నిర్మించాలని ఆయా గ్రామాల వారు అధికారులను కోరుతున్నారు.



ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే ప్రహరీ లేని జోగింపంతులుపేట ప్రాథమిక పాఠశాల

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో ప్రహరీలు లేని పాఠశాలలు వద్ద ప్రహరీల నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులతోపాటు నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

- ఎన్.రామకృష్ణ, ఎంఈవో

పాదయాత్రగా రామతీర్థానికి..

లావేరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం గ్రామానికి చెందిన రామభక్తులు ఆదివారం విజయనగరం జిల్లా నెలిమర్ల మండలంలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థానికి 150 మంది రామభక్తులు పాదయాత్రగా వెళ్లారు. స్వామివారి గీతాలు పాడుతూ వెళ్తుండగా.. వీరికి లావేరు, లావేటిపాలెం, కేశవరాయుపురం గ్రామస్థులు స్వాగతం పలికారు.



పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే గొండు శంకర్
- క్రికెట్ మైదానానికి శంకుస్థాపన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాను క్రీడాహబ్‌గా తీర్చిదిద్దుతామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో క్రికెట్ మైదానం నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేసి మాట్లాడారు. జిల్లాలో క్రీడా వసతులను మరింతగా పెంచేందుకు కృషిచేస్తున్నామని, క్రికెట్ పరంగా సంఘం అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. క్రికెట్ మైదానం పూర్తయితే ఎక్కడికో వెళ్లి మ్యాచ్‌లు ఆడాల్సిన పనిలేదన్నారు. అలాగే కోడిరామ్మూర్తి స్టేడియంను అథ్లెటిక్స్ ట్రాక్‌తోపాటు మల్టీపర్పస్ స్టేడియంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో మూడు నెలల వ్యవధిలో ఈ మైదానాన్ని అందుబాటులోకి తెస్తామని మెంటార్ ఇలియాజ్ మహ్మద్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ, క్రికెట్ సంఘం అధ్యక్షుడు పుల్లెల శాస్త్రి, కార్యదర్శి హసన్ రాజా, కోశాధికారి షైలానీ, సీనియర్ క్రీడాకారులు వందాన మురళీమోహన్, భద్రగిరి మురళీధర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీలు

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా నారాయణ తిరుమలలో భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరవ అధ్యాయంలో జూనియర్ విభాగం 6,7 తరగతుల విద్యార్థులకు, సీనియర్ విభాగం 8, 9 తరగతుల విద్యార్థులకు శ్లోకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బి.యశ్వంత్, బి.సంధ్య, సీహెచ్ మోక్షిత, ఋషివర్మ, వై.హాసిని, బి.హరిత, జి.యోచిత తదితరులు విజేతలుగా నిలిచారు. వీరిని హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ యతిరాజులు, ప్రోగ్రాం అధికారి ఎం.లలితా మణి అభినందించి, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గురుగుబిల్లి శ్రీనివాస్, జి.వెంకటలక్ష్మి, ఎం.శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, కైలాసరావు, ధర్మారావు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సాయం

లావేరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లావేరు జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి, టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ రూ.49 వేలు ఆర్థిక సాయాన్ని హెచ్ఎం పి.జగన్నాథరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఐక్యతతో గ్రామాల సమగ్రాభివృద్ధి: ఎమ్మెల్యే కూన

ఆమదాలవలస (బూర్జ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తలంతా ఐకమత్యంతో నియోజకవర్గంలోని ప్రతీగ్రామం సమగ్రాభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బూర్జ మండలం కొల్లివలస కూడలిలో ఆదివారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలో జరగనున్న నీటిసంఘాల ఎన్నికలను టీడీపీ శ్రేణులు ఐకమత్యంతో గెలుపించుకోవాలని కోరారు. బూర్జ మండలంలో విద్యుత్ పరిశ్రమ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు రామ్‌జీ, వైస్ ఎంపీపీ సూర్యారావు, మాజీ జడ్పీటీసీ శివ్వాల సూర్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అంధ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

గుజరాతీపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో శ్రీకాకుళం అంధ ఉద్యోగులు సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు కమర్షియల్ టాక్స్ డీసీటీవో జి.రవీంద్రబాబు పర్యవేక్షణలో జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కె.అప్పలనాయుడు (నరసన్నపేట), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.త్రినాథరావు (శ్రీకాకుళం), ప్రధాన కార్యదర్శిగా పి.గణపతి (ఆమదాలవలస), ట్రెజరర్‌గా జి.రమణ, మహిళా కార్యదర్శిగా ఎల్.జ్యోత్స్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బి.శ్రీను, బీహెచ్ శ్రీనివాస్, సంయుక్త కార్యద ర్శులుగా కె.మంజుల కుమారి, ఎ.రమణమ్మ తదితరులు ఎన్నికయ్యారు.

క్రైం కార్నర్

హైవేపై ప్రమాదాలు

● విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ.. డ్రైవర్ మృతి


ప్రమాదానికి గురైన లారీ.. పక్కనే ఫరీద్ మృతదేహం

ఎచ్చెర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం జాతీయ రహదారిపై నాలుగు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాత పడగా పలువురికి గాయాలయ్యాయి. ఆ వివరాలిలా ఉన్నాయి.. ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేట (కొయ్యిరాల) జంక్షన్ జాతీయ రహదారి సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో లారీ డ్రైవర్ షేక్ ఫరీద్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళ నాడు నుంచి ధన్‌బాద్ (జార్ఖండ్)కు కొబ్బరి బొండాలతో వెళ్తున్న లారీ కొయిరాల జంక్షన్‌కు వచ్చేసరికి అదుపు తప్పి ఐరన్ రైలింగ్ ఢీకొట్టి సర్వీసు రోడ్డులోకి దూసుకు పోయింది. అక్కడి నుంచి పక్కన ఉన్న కాలువ దాటి పెద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. అయితే విద్యుత్ స్తంభానికి ఆనుకుని గుంత ఉండడంతో లారీ వేగం తగ్గి పెద్ద ప్రమాదం తప్పింది. లేకుంటే విద్యుత్ స్తంభం కూలి పెను ప్రమాదం జరిగేది. ఇద్దరు డ్రైవర్లు ఉన్న ఈ లారీలో ప్రమాదం జరగడానికి గంట ముందు వరకు డ్రైవింగ్ చేసిన ఇస్మాయిల్ సైట్ రసూల్ వెనుక క్యాబిన్‌లో నిద్రకు ఉపక్రమించగా.. మరో డ్రైవర్ షేక్ ఫరీద్ లారీ నడుపుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. షేక్ ఫరీద్ డ్రైవింగ్ ప్రారంభించిన గంటలోనే ప్రమాదం జరగ డంతో నిద్రమత్తు వల్ల జరిగిందా లేదా? లేక గుండె పోటుకు గురయ్యాడా అన్న విషయం పోస్టు మార్టం నివేదికలో తేలాల్సి ఉంది. కాగా ఫరీద్ తమిళనాడు రాష్ట్రం దిండిగల్‌లోని జిన్నానగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కాగా మరో లారీ డ్రైవర్ ఇస్మాయిల్ ఎలాంటి గాయాల్లేకుండానే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఎస్ఐ వి.సందీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి


మృతిచెందిన రవి

టెక్కలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): లచ్చన్నపేట సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న పలాస కోవెలవీధికి చెందిన పిట్ట రవిని కారు ఢీ కొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పలాస నుంచి వ్యక్తిగత పనులపై టెక్కలి వచ్చి తిరుగు ప్రయాణంలో అతివేగంగా వెళ్తున్న ఓ కారు ఢీకొట్టడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బేసి రామచంద్రాపురం వద్ద ముగ్గురికి గాయాలు


ఘటనా స్థలంలో దృశ్యం

సోంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బేసి రామ చంద్రా పురం వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ముగ్గురికి స్వల్పగాయాలైనట్లు ఎస్ఐ హరి బాబు నాయుడు తెలిపారు. శ్రీకాకుళం వైపు నుంచి రామారావు, బైరాగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. కుమారుడితో ద్విచక్ర వాహనంపై వస్తున్న శ్రీదేవి సోంపేట వైపు తిరిగే సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన రామా రావు, బైరాగి, శ్రీదేవిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్య, నైపుణ్యం పెంపొందించడం అభినందనీయం

● ఘనంగా సెంచూరియన్ వర్సిటీ స్నాతకోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ రఘుబర్‌దాస్

ఒడిశా

పర్లాకిమిడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యం పెంపొందిస్తూ సెంచూరియన్ యూనివర్సిటీ ప్రతిభను సాధించడంలో ఒక మైలు రాయిని దాటిందని, ఇది అభినందనీయమని ఒడిశా రాష్ట్ర గవర్నర్ రఘుబర్‌దాస్ అన్నారు. భువనేశ్వర్‌లోని సెంచూరియన్ విశ్వవిద్యాలయం 12వ స్నాతకోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఈ దేశాన్ని అభివృద్ధి పథకంలో తీసుకువెళ్లే బాధ్యత యువతపై ఉందన్నారు. దేశ సమగ్రాభివృద్ధికి ఒడిశా పురోగతి కీలకమని, జాతి పురోగతి యువతరం ఆకాంక్ష కావాలని పిలుపునిచ్చారు. మరో అతిథి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ సందీప్ మెహతా, ఇస్రో ఛైర్మన్ డాక్టర్ శ్రీధర్ ఫణికర్ సోమనాథ్ మాట్లాడుతూ.. భారతదేశం యొక్క సాంకేతిక, సామాజిక ప్రకృతి దృశ్యాన్ని రూపొందించే దిశలో యువత జ్ఞానసాధన స్థిరంగా ఉండాలన్నారు. సుమారుగా 2800 మంది విద్యార్థులకు అతిథులు ధ్రువ పత్రాలు, 47 మందికి డాక్టరేట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు, ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రో, ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ డీఎన్ రావు, రిజిస్ట్రార్ అనితా పాత్ర, వైస్ చాన్సలర్ డాక్టర్ సుప్రియా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో వరి పంట కొనుగోలు: కలెక్టర్

పర్లాకిమిడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామని కలెక్టర్ విజయ్‌కుమార్‌దాస్ తెలిపారు. ఆదివారం స్థానిక గజపతి స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి బరాగడ్ జిల్లాలో వరి పంటకు కనీస మద్దతుధర ప్రకటించి రాష్ట్ర వ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ కొనుగోలును ప్రారంభించారన్నారు. పర్లాకిమిడిలో విజయవంతంగా ప్రారం భమైందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఈనెల 30 నుంచి కొనుగోలు చేస్తుందన్నారు. కనీస మద్దతు ధర రూ.2300 కాగా అదనంగా మరో రూ.800 ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో పర్లాకిమిడి, మోహన్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రూపేష్‌కుమార్ పాణిగ్రాహి, దాశరధి, వ్యవసాయశాఖ అధికారి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌దాస్

రహా ‘దారుణాలు’

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు


వజ్రపుకొత్తూరు: అధ్వానంగా ఉన్న నగరంపల్లి రోడ్డు

పలాస/జలుమూరు/వజ్రపుకొత్తూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రహదారులు దారుణంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన కొద్ది పాటి వర్షాలకు సైతం గోతుల్లో నీరు చేరి ప్రజలు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పలాస-కాశీబుగ్గ పెట్రోల్ బంకు నుంచి అక్కుపల్లి వరకు సుమారు 10 కిలోమీటర్ల రింగ్‌రోడ్డు నిర్మాణాన్ని వైసీపీ హయాంలో చేపట్టినా ఆ తరువాత పనులను మధ్యలోనే విడిచి పెట్టారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు ఎంతో అట్టహాసంగా శంకుస్థాపన చేసిన ఈ పనులు నేటికీ పూర్తి కాలేదు. దీంతో రాళ్లుదేలి ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ● జలుమూరు మండలం అబ్బాయిపేట నుంచి తలతరియా లింగాలపాడు వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా ఉంది. అలాగే ఊడిగలపాడు నుంచి సంతలబైలి, ఎర్రన్నపేట వెళ్లే రహదారి గోతుల మయంగా తయారై ప్రజలు నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే జోనంకి నుంచి కృష్ణాపురం వరకు, అల్లాడ నుంచి రామదాసుపేట వరకు ఉన్న రోడ్ల పరిస్థితి ఇదే.. ● వజ్రపుకొత్తూరు మండలం కేంద్రానికి సమీపంలో ఉన్న నగరంపల్లి బీటీరోడ్డు పెచ్చులూడి అధ్వానంగా తయారైంది. గ్రామానికి సమీపంలో మలుపు వద్దే రోడ్డు పూర్తిగా పాడవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి, ఒక్కోసారి వాహనాలు పల్టీ కొట్టి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల మరమ్మ తులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పలాస: తాళభద్ర మార్గంలో రింగురోడ్డు పనులిలా..


జలుమూరు: అబ్బాయిపేట వద్ద గోతులమయంగా ఉన్న రోడ్డు

రైతుల్లో ‘తుఫాన్’ గండం

● ధాన్యాన్ని కాపాడుకునేందుకు పాట్లు


ఎల్ఎన్‌పేట: వాడవలస సమీపంలో ధాన్యం బస్తాలపై కప్పిన టార్పాలిన్లు

ఎల్.ఎన్.పేట/పలాస రూరల్/నందిగాం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు పడతాయని వాతావరణశాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంటలు చేతికి అంది వచ్చిన సమయంలో రో సారి తుఫాన్ గండంతో వారు ధాన్యాన్ని కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఏడాదంతా కష్టపడి అధిక పెట్టుబడి పెట్టి పండించిన పంట చేతికందిన సమయంలో వరుస తుఫాన్‌ల కారణంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలు గ్రామాలకు చెందిన రైతులు పేర్కొంటున్నారు. ఎల్ఎన్‌పేట మండలంలోని తురకపేట, దబ్బపాడు, వాడవలస, చిట్టిమండలం, చింతలబడవంజ, రావిచెంద్రి, పూశాం, డొంకలబడవంజ, కొత్తపేట, కుసుములపాడు తదితర గ్రామాల్లో పంటలను కోసి పొలంలోనే కుప్పలు పెడుతున్నారు. కోసిన పంట ఎండకుండా కుప్పలు పెడితే ధాన్యం రంగు మారిపోయి ముక్కిపోయే ప్రమాదం ఉందని, దీంతో మద్దతు ధర కంటే తక్కువకు వ్యాపారులు కొనుగోలు చేస్తారని వారు ఆవేదన చెందుతున్నారు. అలాగే పలాస మండలం బ్రాహ్మణతర్లా, కేశుపురం, నారాయణపురం, బంటుకొత్తూరు, పూర్ణభద్ర, అమలకుడియా, రెంటికోట, అల్లుకోల, కైజోల, కొత్తూరు, దానగొర, హిమగిరి, సున్నా డ ప్రాంతాల్లో కొంతవరకు కోతలు పూర్తి చేసినా.. కోతలు చేయని పొలాల్లో పనులను నిలుపుదల చేశారు. నాలుగు రోజుల పాటు ఎటువంటి కోతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. నందిగాం మండలంలోని గ్రామాల్లోనూ పంటలను రక్షించుకునేందుకు అవస్థలు పడుతున్నారు. కుప్పలు తడిసి పోకుండా ఉండేందుకు కుప్పలపై టార్పాలిన్లు కప్పి గాలులకు టార్పాలిన్లు ఎగిరిపోకుండా వాటిపై బరువులను పెట్టాల్సి వస్తోందని పలు గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.


పలాస రూరల్: కైజోలలో మధ్యలోనే వరికోత వదిలి వేసిన దృశ్యం


నందిగాం ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు

ముమ్మర తనిఖీలు

పాతపట్నం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల నియంత్రణకు గాను ఆదివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మేజర్‌పంచాయతీ పాతపట్నంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉండే దుకాణాలు, వాహనాలను సైతం డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టారు. కొరసవాడ, కాగువాడ గ్రామాల్లోనూ కిరాణా దుకాణాలు సైతం తనిఖీ చేసినట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

టెక్కలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని టెక్కలి సీఐ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి పెద్దరోకళ్లపల్లిలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు కనిపించినా, కొత్తవ్యక్తులు సంచరించినా పోలీసులకు తెలియజేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెల్మెట్, ధారణ, సీటు బెల్టుపై అవగాహన కల్పించారు. గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.



తూర్పుకాపులను ఆదుకోవాలి

టెక్కలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న తూర్పు కాపులను ఆదుకోవాలని ఆ సంఘ నాయకుడు ఎం.గణపతిరావు కోరారు. ఆదివారం టెక్కలి మండలం బన్నువాడ, మోదు గువలస, నర్సింగపల్లి, జగన్నాథపురం, కొల్లివలస తదితర గ్రామాల్లో ఆ సామాజికవర్గ ప్రతినిధులు పర్య టించారు. రాజకీయాలకు అతీతంగా తూర్పుకాపుల అభివృద్ధికి పాలకులు సహకరించాలని కోరారు. టెక్కలిలో సామాజిక భవనానికి స్థలం మంజూరు చేయాలని, అర్హులైన తూర్పు కాపులకు పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలివ్వాలని కోరారు. జనవరి 5న టెక్కలి సమీపంలో కాపుల ఐక్యత సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగపల్లి సర్పంచ్ రౌతు జయ మోహన్, మాజీ సర్పంచ్ పోలాకి షణ్ముఖరావు, గందరగోళం శ్రీనివాసరావు, తమిరె బలరాం, పోలాకి శంకర్ తదితరులు పాల్గొన్నారు.


నర్సింగపల్లిలో మాట్లాడుతున్న తూర్పుకాపు సంఘ నాయకులు

ప్రమాదపు అంచున..!

హరిపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భోగాపురం గ్రామం వద్ద మహేంద్రతనయ నదిలో ఏర్పాటు చేసిన ఇన్‌ఫిల్ట్రేషన్ బావి ప్రమాదపు అంచున ఉంది. ఇసుక అక్రమ రవాణాతో పాటు నీటి ప్రవాహ ఉధృతికి ఇలా బావి చుట్టూ ఉన్న ఇసుక కోరుకుపోయింది. సుమారు 1500 జనాబా ఉన్న గ్రామానికి నీరందించే బావి ఇలా ప్రమాదపు అంచున నిలిచింది. కింద పునాదులు పైకివచ్చి సిమెంట్ లేని రాళ్ల మధ్య ఖాళీలు కనిపిస్తుండడంతో ఎప్పుడు బావి కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఇసుక పేర్పులో ఇన్‌ఫిల్ట్రేషన్ కాకుండా నీరు నేరుగా వస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కోతకు గురైన ఇన్‌ఫిల్ట్రేషన్ బావి →



లోక కల్యాణం కోసం చండీయాగం


సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

నరసన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం స్థానిక సూర్యనారాయస్వామి దేవాలయం లో ఆదివారం అయ్యప్పస్వాములు చండీయాగం నిర్వహించారు. ఆలయ అర్చకులు నాని ఆధర్యంలో అర్చకులు విష్ణు శ్వర పూజ, మండపారాధన, శ్రీ రుద్ర సహిత నవ చండీ పారాయణతో పాటు చండీయాగం చేపట్టా రు. అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో సారేపల్లి గోవింద స్వామి, జనార్దనరావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పనులపై ఈఎన్‌సీ ఆరా

మెళియాపుట్టి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొండలపై ఉన్న గిరిజన గ్రామాలకు వేస్తున్న రోడ్ల పనులపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ శ్రీనివాసరావు ఆరా తీసినట్టు సమాచారం. ఈనెల 4న 'ఆంధ్రజ్యోతి'లో 'మటి పూసి..మాయచేసి' శీర్షికతో వచ్చిన కథనంపై స్పందించి ఏఈ పనులను చూడకుండా బిల్లులెలా చేశారని ఆరా తీసినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం అందించాలని సీతంపేట ఐటీడీఏ ఈఈ రమదేవిని ఆదేశించినట్లు తెలిసింది. అయితే పనుల పరిశీలనకు ఆయన వస్తున్నట్లు తెలుస్తుడడంతో ఇంజనీరింగ్ అధికారుల్లో గుబులు నెల కొంది. రికార్డులను మార్పిడి చేసే పనిలో ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఒక అధికారి పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఇంజనీరింగ్ అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.


అడ్డివాడ రహదారిపై మట్టి తీసి గడ్డి వేసిన దృశ్యం

కారు బోల్తా: తప్పిన ప్రమాదం

నందిగాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సుభద్రాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం కారు అదుపు తప్పి బోల్తాపడింది. అయితే అందులో ప్రయాణి స్తున్న వారు స్వల్పగాయాలతో బయటపడడంతో పెద్ద ప్రమాదం తప్పి నట్లయ్యిం ది. టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న కారు సుభద్రాపురం సమీపంలో డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టి బోల్తాపడింది. దానిలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు కాగా వారిని హైవే అంబు లెన్స్‌లో పలాస ఆసుపత్రికి తరలించారు. ప్రమా దంపై నందిగాం పోలీసులను ప్రశ్నించగా ఎటువంటి సమాచారం రాలేదని తెలిపారు.



పర్యాటకులతో బీచ్‌లు కిటకిట


పోలాకి: రాజారాంపురం తీరంలో స్నానాలు చేస్తున్న సందర్శకులు


వజ్రపుకొత్తూరు: పర్యాటకులతో కిక్కిరిసిన శివసాగర్ బీచ్

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వనభోజనాలు సీజన్ కావడంతో ఒడిశా రాష్ట్రంతో పాటు కాశీబుగ్గ తదితర ప్రాంతాల నుంచి ఎక్కువ మంది కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి బీచ్‌కు వచ్చి ఆనందం పొందారు. సమీపంలోని తోటల్లో వన భోజనాలు చేసి మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు బీచ్‌లో సందడి చేశారు. తీరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● పోలాకి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజారాంపురం సాగర తీరంలో పిక్నిక్ సందడి ఆదివారం నెలకొంది. వందలాది మంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. వనభోజనాలు చేసి సాయంత్రం సాగర తీరంలో కేరింతలు కొట్టారు. దూర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాలతో సందర్శకులు సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

న్యూస్ బాక్స్

బైదలాపురం ఆశ్రమ పాఠశాల తనిఖీ



పాతపట్నం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బైదలాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ డీడీ అన్నయ్య దొర ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టీలను పరిశీలించారు. 93 మంది విద్యార్థులకు గాను 78 మంది హాజరు కావడంపై సిబ్బందిని ప్రశ్నించారు. రికార్డులను, భోజన పదార్థాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వార్డెన్ ఎ.సింహాచలం, జోగారావు ఉన్నారు.

సత్యసాయి సేవామార్గం అనుసరణీయం

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబాది సేవా మార్గమని, దీనిని ప్రతి ఒక్కరూ అనుసరించాలని రాష్ట్ర ఆధ్యాత్మిక సమన్వయకర్త పడాల ప్రసాదరావు అన్నారు. బైపల్లి సత్యసాయి భజన మండలి దశమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి బోధనలతో శాంతి నెలకొంటుందన్నారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవకులు భజనలు, భక్తి గీతాలాపనలు చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం జోనల్‌స్థాయి కన్వీనర్ల సమావేశం జరిగింది.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పాతపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రూ.40 లక్షల నాబార్డ్ నిధులతో చేపడుతున్న ఫెసిలిటీ సెంటర్ భవన పనులను చేపడుతున్నామని మార్కెటింగ్ శాఖ డీఈఈ కోటయ్య తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలుండేలా ఆదేశించామన్నారు. ప్లాట్‌ఫాం పనులను ఆదివారం పరిశీలించారు.

సొంత ఖర్చులతో పూడికతీత



పాతపట్నం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ పరిధిలోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికను కాలనీ వాసులు చందాలు వేసుకుని తొలగిస్తున్నట్లు రిటైర్డ్ ఎంపీడీవో సలాన చిరంజీవి తెలిపారు. చాలా కాలంలో కాలువల్లో మట్టి పేరుకుపోవడంతో మురుగునీరు పారేందుకు అవకాశం లేకుండా పోయిందని, దీంతో ఏ మాత్రం వర్షంకురిసినా రోడ్డుపై నీటి ప్రవాహంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు తెలిపారు. ఈ నేపథ్యంలో తాము చందాలు వేసుకుని ఈ పనులు చేపడుతున్నామన్నారు.

బాలియూత్ ఫోర్స్ ఆవిర్భావం

జలుమూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కళింగుల ప్రాచీన వైభవాన్ని, చరిత్రలో ముఖ్యమైన ఘట్టాలు, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేసేందుకు ఆదివారం శ్రీముఖలింగేశ్వర స్వామి సన్నిధిలో బాలియూత్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఆ సంఘ ప్రతినిధులు తెలిపారు. నాటి కళింగసీమ రాజధాని ప్రాంతమైన శ్రీముఖలింగంలో ఇటీవల కార్తీక పౌర్ణమి సందర్భంగా వంశధార నదీ తీరాన బాలియాత్ర విజయవంతమైందని, దీనిని ఆదర్శంగా తీసుకుని గ్రామాల్లో ప్రాచీన కళింగ సంప్రదాయాలను ఈ ఫోర్స్ ద్వారా ప్రచారం చేయనున్నామన్నారు. అలాగే ముఖలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మన్నగారి సతీష్, ఆ సంఘ నేతలు కరుకోల హరిప్రసాద్, దువ్వాడ జీవితేశ్వరరావు పాల్గొన్నారు.